అధునాతన సాంకేతికతతో ఫోరెన్సిక్ మెడిసిన్


నైపుణ్యం పెంచుకుంటే లక్ష్యాలు సమర్థంగా చేరుకునే వీలు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి.. చిత్రంలో డా.రఘునందన్, ఫణికిరణ్, లావణ్యకుమారి, పి.ఉమామహేశ్వరరావు, ఎ.విష్ణువర్ధన్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఫోరెన్సిక్ మెడిసిన్ ద్వారా సమాజానికి ఉపయోగపడే కొత్త పోకడలు, సాంకేతికతను అందరూ అందిపుచ్చుకుని, నైపుణ్యాలు పెంచుకోవాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి సూచించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో దక్షిణభారత మెడికో లీగల్ అసోసియేషన్ (సిమ్లా) 20వ వార్షిక సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ కళాశాలలోని ఫోరెన్సిక్ మెడిసిన్- టాక్సికాలజీ విభాగం నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల సదస్సులో రాధికారెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతికత, కొత్త పోకడలను అవగతం చేసుకోవాలన్నారు. ఫోరెన్సిక్‌లో మహిళా వైద్యులు మరింత రాణించాలని ఆకాంక్షించారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ జి.రఘునాథ్ మాట్లాడుతూ వైద్య విద్యలో అన్ని సబ్జెక్టులూ ఫోరెన్సిక్‌తో మిళితమై ఉంటాయన్నారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్ సాంకేతికత, డిజిటల్ పోస్టుమార్టం కీలక భూమిక పోషిస్తాయన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా, ఉత్తర భారతదేశ రాష్ట్రాల నుంచి 500 మంది పైగా నిపుణులు, విద్యార్థులు హాజరయ్యారు. సిమ్లా నిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు డా.పి.ఉమామహేశ్వరరావు, ఫణికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ ఉప ప్రధానాచార్యులు ఎ.విష్ణువర్ధన్, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డీపీవీఎస్ శశి పాల్గొన్నారు.

గోదారమ్మా.. నయనం.. పయనం.. నీవైపు




ఓ వైపు గోదావరి హొయలు.. మరో వైపు సాగర కెరటాల పరవళ్లు.. ఎంతో ప్రశస్తి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రాలు.. కట్టిపడేసే ప్రకృతి రమణీయత.. వహ్వా అనిపించే ఆహార రుచులు.. ఇది కదా తూర్పుగోదావరి అంటే..ఇక్కడి మనుషులే కాదు పచ్చని వనాలూ ఆప్యాయంగా పలకరిస్తాయి. దేశ విదేశాల నుంచి వచ్చే సందర్శకులు ఓ చక్కని అనుభూతిని ప్రోది చేసుకొని తీయని జ్ఞాపకాలతో వెనుదిరుగుతుంటారు. వైకాపా సర్కారు గత అయిదేళ్లూ ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రగతిని విస్మరించింది.. కూటమి ప్రభుత్వం వచ్చాక కీలక ప్రాజెక్టులకు నడుంబిగిస్తోంది. వాటి సంగతి చూద్దామా..

ఈనాడు, రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, పట్టిసీమ, పేరుపాలెం బీచ్‌ను అనుసంధానం చేస్తూ రూ.100 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టును కేంద్ర నిధులతో పట్టాలెక్కిస్తున్నారు. ఆధ్యాత్మిక, పర్యావరణ (ఎకో), నదీ (రివర్) పర్యాటకాన్ని మేళవిస్తారు. సందర్శకులు కనీసం నాలుగు రోజులు బస చేసే లక్ష్యంతో ప్రణాళికలు తయారుచేస్తున్నారు. వచ్చేనెల 15వ తేదీలోగా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు డీపీఆర్ అందనుంది. ఆమోదం లభిస్తే 4 వేల మందికి ఉపాధి కూడా లభిస్తుంది.

రూ.11 కోట్లతో తీర సొగసులు

కాకినాడలో 2018లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం స్వదేశీ దర్శన్‌లో భాగంగా రూ.47.50 కోట్లతో సముద్రతీరాన్ని అభివృద్ధి చేసింది.. వైకాపా వచ్చాక నిర్వహణ గాలికి వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం రూ.11 కోట్లతో వాటర్ పార్కు, ట్రెక్కింగ్, ఫౌంటైన్లు, రెస్టారెంట్లు ఏర్పాటుచేస్తోంది. దసరాకు అందుబాటులో తీసుకొస్తారు. గతంలో రోజుకు సగటున సముద్ర తీరానికి 1700 మంది వస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య పెరగనుంది.



కాకినాడ సముద్రతీరాన్ని మునుపటిలా తీర్చిదిద్దేందుకు పనులు

రెండురోజుల ఆధ్యాత్మిక యాత్ర

ఉభయ గోదావరి జిల్లాల్లోని 8 నుంచి 10 ఆధ్యాత్మిక క్షేత్రాలను కలుపుతూ ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా బస్సులు నడపాలన్న మంత్రి దుర్గేష్ ఆలోచనను పర్యాటక శాఖ రవాణా విభాగం పట్టాలెక్కించే పనిలో ఉంది. రెండురోజుల పాటు వివిధ ప్రాంతాలు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కడియం అందాల వీక్షణ..



కడియం నర్సరీలను సందర్శకులు వీక్షించేలా ప్రాజెక్టులు రాబోతున్నాయి. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి తదితరులు నర్సరీ ప్రతినిధులు, పర్యాటక అధికారులతో చర్చించారు. ధవళేశ్వరం లేదా వేమగిరి నుంచి కడియపులంక పూల మార్కెట్ వరకు బోటింగ్, ఆ పరిధిలోని గోదావరి గట్ల సుందరీకరణ చేపడతారు. నర్సరీల గుండా నడిచి లేదా బ్యాటరీ వాహనంపై సందర్శకులు వెళ్లేలా ఆలోచన చేసినప్పటికీ.. కొన్ని అభ్యంతరాల నేపథ్యంలో 500 మీటర్ల మేర జిప్‌లేన్ వేస్తారు. ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..

ప్రస్తుత ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అవకాశం ఉన్న ప్రతి వనరునూ సద్వినియోగం చేసుకుంటాం. అఖండ గోదావరి ప్రాజెక్టును పుష్కరాల లోగా పూర్తిచేస్తాం. కాకినాడలో వాటర్ పార్కు దసరాలోపు, ఇతర పనులు డిసెంబరుకి పూర్తి చేస్తాం.

-స్వామినాయుడు, పర్యాటకశాఖ ఆర్జేడీ, రాజమహేంద్రవరం



హేవలాక్‌పై నుంచి బంగీ జంప్..

రాజమహేంద్రవరానికి మణిహారమైన హేవలాక్ వంతెన, గోదావరి మధ్యలో ఉన్న బ్రిడ్జి లంకను అనుసంధానం చేస్తూ ప్రత్యేక ప్రాజెక్టు రూపొందిస్తున్నారు. బ్రిడ్జిలంకలో జల, సాహస క్రీడలు... హేవలాక్ వంతెన పైనుంచి గోదావరిలోకి బంగీ జంప్ తదితర ఆకర్షణలు ఉంటాయి. అనంతరం హేవలాక్‌పై నుంచి సుమారు కి.మీ మేర నడిచి రేవులోకి చేరుకునేలా పర్యాటక శాఖ ప్రణాళికలు తయారుచేసింది. ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఈ ఏడాది చివరి నాటికి ఏర్పాటవుతుంది.

బోటుపై హాయిహాయిగా..



ఆదుర్రు బోటింగ్ టెర్మినల్

కోనసీమలోని ఆదుర్రు, పాసర్లపూడి, కోటిపల్లి ప్రాంతాల్లో బోటు షికారు గత కొన్నాళ్లుగా మూలనపడింది. త్వరలో ఆరంభం కానుంది.. ఆదుర్రులో టెండర్లు పిలుస్తున్నారు. పాసర్లపూడిలో ఓఅండ్ఎం విధానంలో నిర్వహణకు చర్యలు చేపట్టారు. ● ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి ఆనుకుని పిచ్చుకలంక వద్ద 56 ఎకరాల విస్తీర్ణాన్ని ఒబెరాయ్ ప్రతినిధులు పరిశీలించారు. రిసార్టులు, రెస్టారెంట్లు ఏర్పాటుకానున్నాయి. జల, సాహస క్రీడలూ ఉంటాయి.

తిన్నదంతా కక్కిస్తారా..?

- సీఎం దృష్టికి రూ.582 కోట్ల జయలక్ష్మి సొసైటీ కుంభకోణం..
- కూటమిపైనే ఆశలు.. నేడు సొసైటీ సమావేశం



ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, సర్పవరం జంక్షన్: 'జయలక్ష్మితో పొదుపు- మీ ప్రగతికి మలుపు'.. నినాదంతో ఆశల వల విసిరారు. ఆకర్షణీయమైన వడ్డీ.. 60 నెలల్లో సొమ్ము రెట్టింపు అని నమ్మించి.. ఖాతాదారుల నుంచి వందల కోట్లు వసూలు చేశారు.. అడ్డదారిన నిధులు మళ్లించేశారు. కుంభకోణం వెలుగుచూసి రెండున్నరేళ్లు దాటింది. న్యాయం కోసం బాధితులు కాళ్లరిగేలా తిరిగినా..మనోవేదనతో 60 మందికిపైగా ప్రాణాలు విడిచినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ముఖ్యమంత్రి జగన్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా వినిపించుకోలేదు. సహకార శాఖ విచారణ- నివేదికలు.. పోలీసు దర్యాప్తు పేరుతో ఇంకొన్నాళ్లు కాలం గడిచింది. కేసు సీఐడీ చేతికి వెళ్లినా నేటికీ బాధితులకు పైసా అందలేదు. తాజాగా సమస్యను జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ నూతన పాలక వర్గం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. బాధితులకు న్యాయం చేయాలని, సంస్థకు ఆర్థిక ఊతమివ్వాలని కోరింది.

సొసైటీ మూడో మహాజన సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే చర్చ, నిర్ణయాలపై అంతటా ఆసక్తి నెలకొంది.

ఆరు జిల్లాల్లో బాధితులు..

'ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్'ను 1999 జనవరి 27న సర్పవరం కూడలిలో స్థాపించారు. కాకినాడ జిల్లాలో 11, కోనసీమలో ఆరు, తూర్పుగోదావరిలో 5, పశ్చిమ గోదావరిలో ఒకటి, విశాఖలో 5, విజయవాడలో ఒకటి చొప్పున బ్రాంచిలు ఉన్నాయి. 2022 ఫిబ్రవరి 28 నాటికి సంఘంలో 19వేల మంది నుంచి రూ.458 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు.. 2,245 మంది సభ్యులకు రూ.455.78 కోట్లు రుణాలిచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. డిపాజిట్ల సొమ్ము కాలపరిమితి ముగిసినా చెల్లించకపోవడంతో బాధితులు నిలదీశారు. 2022 ఏప్రిల్ 9 నుంచి జూన్ 3 మధ్యలో 21 పోలీసుస్టేషన్లలో 24 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వైకాపా నాయకులు చక్రం తిప్పి సొమ్ము బొక్కేసిన యాజమాన్యానికి తెరవెనుక సహకారం అందించడంతో చర్యల్లో జాప్యం జరిగింది.

సొసైటీ ఆర్థిక పరిస్థితి, బాధితుల వేదనను లేఖ రూపంలో ఈనెల 20న ఛైర్మన్ జి.త్రినాథరావు, వైస్‌ఛైర్మన్ పి.వి.రమణమూర్తి తదితరులు లిఖితపూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

అడ్డదారి రుణాలతో..

రూ.582 కోట్ల విలువగల రుణాలు అడ్డదారిన ఇచ్చినట్లు తేలింది. సొసైటీ ఛైర్మన్ రాయవరపు సీతా రామాంజనేయులుతోపాటు రాయవరపు బద్రి విశాలాక్షి, జయదేవ్ మణిలను సీఐడీ అరెస్టు చేసింది. రూ.కోట్లు బొక్కేసిన వ్యక్తి లండన్‌లో ఉండడంతో లుక్ అవుట్ నోటీసు జారీచేసినా నేటికీ అదుపులోకి తీసుకోలేదు. సీఐడీ 21 ఛార్జిషీట్లు దాఖలు చేయడంతో విచారణ కొలిక్కివచ్చింది. ఈడీ దస్త్రాలు పరిశీలిస్తోంది. సొసైటీకి డిపాజిట్ల కింద సేకరించిన సొమ్ము వడ్డీతో కలిపి రూ.540 కోట్లు.. రుణాలిచ్చిన సొమ్ము వడ్డీతో రూ.702 కోట్లు అయింది.

ఆర్థిక ఊతమిస్తేనే..

కుంభకోణం కేసును సీఐడీ స్వీకరించే నాటికి అన్ని బ్రాంచిల్లో కలిపి మిగిలింది రూ.6 కోట్లు మాత్రమే.. సీజ్ చేసిన సొమ్ము బ్యాంకు కార్యకలాపాలకు విడుదల చేయాల్సిఉంది. సీఐడీ ఆంధ్రప్రదేశ్‌లో రూ.300 కోట్ల విలువైన 84 ఆస్తులు, తెలంగాణలో రూ.200 కోట్ల విలువైన 110 ఆస్తులు సీజ్ చేసింది. కేసుకు మోక్షం దక్కి, ఈ నిధులు సమకూరితే బాధితులకు భరోసా దక్కినట్లే.

బాలబాలాజీ ప్రసాదానికి నెయ్యి మార్పు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి మార్చారు. ఇక్కడ ఇన్నాళ్లూ రైతు డెయిరీ నెయ్యి ఉపయోగిస్తున్నారు. రుచి లేకపోవడం, తగిన నిల్వ ఉండకపోవడంతో భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. ఇటీవల పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆలయానికి వెళ్లి లడ్డూ, నెయ్యి డబ్బాలను పరిశీలించి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తంచేశారు. రైతుడెయిరీ స్థానే నాణ్యత ఉన్న నెయ్యిని ఉపయోగించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను కోరారు. దీంతో ప్రస్తుతం విశాఖ నెయ్యి ఉపయోగిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సమష్టిగా పనిచేయాలని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హత్యలు, మహిళలపై జరిగే నేరాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రహదారి భద్రత, ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: దసరా సందర్భంగా జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వారం రోజులపాటు దూర ప్రాంతాలకు బస్సులను సిద్ధం చేస్తున్నారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల పరిధిలో 288 బస్సులు ఉండగా ఇటీవల 22 కొత్తగా వచ్చాయి. మూడు డిపోల మేనేజర్లతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి ఇప్పటికే సూచనలు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవు కావడం, 4 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో ముందుగానే ప్రయాణికుల రద్దీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ రూటులో అధికంగా..

హైదరాబాద్ రూటులో అత్యధికంగా బస్సులు తిప్పనున్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు 15, తుని నుంచి 10, ఏలేశ్వరం నుంచి 5 బస్సుల చొప్పున తిప్పనున్నారు. రద్దీకి అనుగుణంగా విజయవాడ, విశాఖపట్నం రూట్లలో 20 బస్సుల చొప్పున నడపనున్నారు. బెంగళూరుకు ఒక ప్రత్యేక సర్వీసు కాకినాడ డిపో నుంచి తిప్పనున్నారు. హైదరాబాద్ నుంచి 42 సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు దసరా పండగలో మూడురోజులపాటు కాకినాడతోపాటు తుని, ఏలేశ్వరం డిపోలకు రానున్నాయి.

మైదానంలో రాజకీయ క్రీడ

- వైద్య విద్యార్థులకంటే పరాయి పెత్తనమే ఎక్కువ
- ఒత్తిళ్లు తాళలేక రంగరాయ ప్రాంగణం మూసివేత



మూసివేసిన క్రీడా ప్రాంగణం (అంతరచిత్రం) గేటుకు వేసిన తాళం

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, మసీదు సెంటర్: కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానం.. గత కొన్నాళ్లుగా దీని చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. ఇక్కడ వైద్య విద్యార్థుల ఆటల కంటే బయటి సంస్థల, ప్రైవేటు వ్యక్తుల హడావిడే ఎక్కువ. రాజకీయ పెత్తనం సరేసరి. ఈ క్రమంలో తరచూ వాగ్వాదాలు, ఆటలకు ఆటంకాలు కలుగుతున్నాయి. చివరకు ఓ ప్రజా ప్రతినిధి వచ్చి తిట్ల దండకంతో ఫోరెన్సిక్ విభాగాధిపతి, క్రీడా బోర్డు కార్యదర్శిపై చెయ్యి ఎత్తే పరిస్థితికి వచ్చింది. తాజా పరిణామాలతో ఆందోళన చెందిన కళాశాల యాజమాన్యం గేట్లకు తాళాలు వేసి మైదానాన్నే మూసేసింది.

సిఫార్సులు తెచ్చిన తంటా..

రంగరాయ వైద్యకళాశాల ప్రాంగణంలో ఓ చిన్న మైదానం, పురుషుల వసతిగృహం ఎదురుగా 13 ఎకరాల్లో మరో ప్రధాన క్రీడా మైదానం ఉన్నాయి. పెద్ద మైదానానికి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారుల తాకిడి ఎక్కువ. వ్యాయామం, పోలీసు శిక్షణ, క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుల సాధన, వాలీబాల్ ఆట, వాకర్స్ క్లబ్ ప్రతినిధుల నడక... ఇలా అధికసంఖ్యలో వచ్చేస్తున్నారు. వైద్యకళాశాల విద్యార్థులు 500 మంది వరకు ఆటలకు వస్తుంటారు. బయటి వ్యక్తుల తాకిడి ఎక్కువై విద్యార్థులకు సొంత మైదానంలో నిలిచే అవకాశం లేకపోయింది. చిన్న మైదానంలో ప్రైవేటు టెన్నిస్ అకాడమీ ఆటలు సాగుతున్నాయి. గతంలో ఆడొద్దని ఆంక్షలు విధిస్తే కాకినాడ వైకాపా నేతతో ఒత్తిడి తెచ్చి మరీ పాగా వేశారు.

వాగ్వాదాలు.. దాడులు

గత కొన్నాళ్లుగా బయటి నుంచి ఆటలకు వచ్చిన యువకులతో వైద్య విద్యార్థులు, విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారు. వారి తీరుపై అభ్యంతరం తెలిపిన ప్రతిసారీ వాగ్వాదాలే. ఈనెల 14న ఆర్ఎంసీ ప్రిన్సిపల్‌కు వైద్య విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు వ్యక్తులు ఆటల్లో బెట్టింగులకు కూడా పాల్పడుతున్నారని పేర్కొనడం గమనార్హం. యాజమాన్యం అప్రమత్తమై బయటి వ్యక్తుల రాకపై ఆంక్షలు విధించింది. దీంతో నాయకుల ద్వారా ఆర్ఎంసీ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. ఈనెల 21న మళ్లీ ఆడడానికి వచ్చిన బయటి వ్యక్తులు వైద్యవిద్యార్థులు, యాజమాన్యంతో గొడవపడి.. విషయం కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. నేరుగా వారితో మైదానానికి వచ్చిన ఎమ్మెల్యే ఆర్ఎంసీ వైద్యుడు ఉమామహేశ్వరరావును అసభ్యపదజాలంతో దూషించారు. ఆయన అనుచరులు వైద్యుడితో పాటు.. విద్యార్థులపై దాడికి దిగడంతో వివాదం పెరిగింది. ఎమ్మెల్యే, అనుచరులపై కేసు పెట్టేవరకు వెళ్లింది. రంగరాయ క్రీడా మైదానాన్ని బయటి వ్యక్తులు ఆక్రమించారంటూ వైద్య విద్యార్థులు జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరిస్థితి సద్దుమణిగే వరకు ఎవరూ మైదానంలోకి వెళ్లకుండా ప్రధాన గేట్లకు యాజమాన్యం తాళాలు వేసింది.

ఏలేరుకు కొట్టుకొచ్చిన భారీ కొండచిలువ



కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న వరద నీటి పరిమాణాన్ని గురువారం నుంచి పెంపు చేశారు. నీటి ప్రవాహంతో పాటు విషసర్పాలు కొట్టుకువస్తున్నాయి. పాలెంలోని ఏలేరు ప్రధాన కాలువలో చేపల వేటకు పెద్ద వల కట్టడంతో దానిలో సుమారు 20 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ చిక్కుకుంది. స్థానిక యువకులు దానిని వధించారు. గ్రామస్థులు ఎవరూ కాలువలోకి దిగవద్దని అధికారులు సూచిస్తున్నారు.

రూ.4.30 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



అధికారులతో చర్చిస్తున్న కుడా వీసీ భావన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ద్వారా రూ.4.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడానికి బోర్డు సమావేశంలో ఆమోదం తెలిపారు. గురువారం 'కుడా' వైస్ ఛైర్మన్, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన అధ్యక్షతన కుడా కార్యాలయంలో బోర్డు సమావేశం నిర్వహించారు. కాకినాడలోని ఎంఎస్ఎన్ ఛారిటీస్ జూనియల్ కళాశాలలో రూ.1.20 కోట్లతో ఆట స్థలం అభివృద్ధికి నిధులు కేటాయించారు. సామర్లకోట రైల్వేస్టేషన్ వద్ద క్లాక్‌టవర్ పునరుద్ధరణ, ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి ఆరు పనులకు ఆమోదం తెలిపారు. బిల్డర్ అండ్ డెవలపర్ లైసెన్స్ ఫీజు సవరణను ఆమోదించారు. ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శి కాళీబాబు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్, జిల్లా పర్యాటక అధికారి పోసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెట్‌కు 21,471 మంది

కాకినాడ నగరం: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జిల్లాలో అక్టోబరు 3 నుంచి 21 వరకు జరగనుందని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. అయాన్ డిజిటల్ జోన్ (ఎస్.అచ్యుతాపురం), సాఫ్ట్ టెక్నాలజీ కాకినాడ, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల(సూరంపాలెం)లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 21,471 మంది హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఇద్దరు ఆర్డీవోల బదిలీ

కాకినాడకు మల్లిబాబు, పెద్దాపురానికి శ్రీరమణి నియామకం



మల్లిబాబు



శ్రీరమణి

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావును బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపాతో అంటకాగిన వీరికి స్థాన చలనం కల్పించారు. కిషోర్ గత ఏడాది అక్టోబరులో కాకినాడ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల నుంచి జె.సీతారామారావు పెద్దాపురం ఆర్డీవోగా పనిచేస్తున్నారు. ఆయన కొన్ని నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. వైకాపా పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. వీరిని బదిలీ చేస్తూ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. సాధారణ పరిపాలన శాఖకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకినాడ ఆర్డీవోగా ఎస్ మల్లిబాబును నియమించారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. గతంలో పెద్దాపురం ఆర్డీవోగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేశారు. 1995లో ఉప తహసీల్దారుగా ఆయన ప్రస్థానం ప్రారంభించారు. యు.కొత్తపల్లి, రాజమహేంద్రవరం అర్బన్‌లో తహసీల్దారుగా సేవలందించారు. పెద్దాపురం ఆర్డీవోగా కె.శ్రీరమణిని నియమించారు. ఆమె ప్రస్తుతం కాకినాడలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్నారు మహిళా మార్టుల ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెప్మా పీడీగా సేవలందించారు. ఒకటి, రెండు రోజుల్లో కొత్త ఆర్డీవోలు విధుల్లో చేరనున్నారు.

బాహుబలి బొంతు



కాకినాడ సముద్ర జలాల్లో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు సుమారు వంద కేజీల భారీ బొంతు చేప చిక్కింది. గురువారం కుంభాభిషేకం రేవులో అమ్మకానికి పెట్టగా వ్యాపారి సత్తి బాబు రూ.19 వేలకు కొనుగోలు చేశారు. ఈ చేపలను బెంగళూరు వంటి పెద్ద నగరాల్లోని రెస్టారెంట్లలో అధికంగా వినియోగిస్తారని మత్స్యకారులు తెలిపారు. గత అయిదేళ్లలో ఇంత భారీ చేప దొరకలేదన్నారు. ఇవి తీరానికి చాలా దూరంలో ఉంటాయని, తుపాను సమయంలో దగ్గరగా వస్తాయని తెలిపారు.

- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

వైకాపా చేసిన తప్పునకు క్షమాపణ కోరుతున్నాం: ఎంపీ

పిఠాపురం: తిరుమల లడ్డూలో కల్తీనెయ్యి కలిపి తప్పు చేసిన వైకాపా తరఫున జనసేన పార్టీ ప్రజలను క్షమాపణ కోరుతుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పిఠాపురంలోని ఉప్పాడ బస్టాండ్ కూడలిలో గురువారం దివ్యాంగులు చేపట్టిన దీక్షకు ఎంపీతోపాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కల్తీ పాపం నుంచి విముక్తి పొందేందుకు హిందువులంతా గ్రామస్థాయిలో ఆలయాలను శుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, మార్నీడి రంగబాబు, చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఐఏలో 44 మందికి పాజిటివ్

ముగిసిన గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.సమత

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం గురువారంతో ముగిసింది. 350 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి తెలిపారు. విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్(వీఐఏ) పరీక్షలో 44 మందికి పాజిటివ్‌గా తేలిందన్నారు. 43 మందికి వైద్యసేవలు అందజేయగా.. ఒకరిని బయాప్సీ పరీక్ష చేయించుకోవాలని సూచించామన్నారు. వీఐఏ పరీక్ష థర్మల్ కోయాగ్యులేషన్ చికిత్సపై స్థానిక వైద్యులు, నర్సులు, పీజీ వైద్యవిద్యార్థులకు అమెరికా బృందం శిక్షణ ఇచ్చిందన్నారు. థర్మల్ కోయాగ్యులేషన్ పరికరాన్ని అమెరికా నిపుణులు ఆసుపత్రికి అందజేశారన్నారు. క్యాంపు ముగింపు సందర్భంగా అమెరికా వైద్యబృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ సన్మానించారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన పీఐఎన్‌సీసీ ప్రెసిడెంట్ జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, పీఐఎన్‌సీసీ భారత ప్రతినిధి డా.సమత కడియాల, అమెరికాకు చెందిన డా.సుసాన్ కోక్రాన్, డా.కరోల్ హౌబాచ్, జీజీహెచ్ రేడియేషన్ హెచ్‌వోడీ డా.పి.శ్రీనివాసన్, గైనిక్ హెచ్‌వోడీ డా.అనురాగమయి తదితరులు పాల్గొన్నారు.

బినామీలకు చోటివ్వొద్దు

కాకినాడ నగరం: గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని యునైటెడ్ బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉభయగోదావరి జిల్లాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్ కోరారు. కాకినాడలోని తన నివాసంలో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 20 శాతం వాటా కల్పించాలన్న బీసీ సంఘాల డిమాండ్ మేరకు సీఎం చంద్రబాబు ఈ అవకాశాన్ని కల్పించారన్నారు. తమ సంఘీయులను ప్రలోభాలకు గురిచేసి వారి దుకాణాలను ఇతరులు పొందితే తామే ఫిర్యాదు చేసి వాటిని రద్దు చేయిస్తామన్నారు. 10 శాతం దుకాణాల కేటాయింపు పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రివర్గ సభ్యులకు బీసీ సంఘాల తరఫున వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	12,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

ఆకస్మిక బదిలీలపై ఆవేదన

కాకినాడ కలెక్టరేట్: జిల్లా నుంచి 20 మంది గ్రామ సర్వేయర్లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేశారని, దీనిని పునః పరిశీలన చేయాలని వారంతా కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత పరిపాలన సౌలభ్యం పేరుతో ఆ జిల్లాలో నియమించడం దారుణమన్నారు. కాకినాడ జిల్లాలో గ్రామ సర్వేయర్ల కొరత ఉందని చూపి, అక్కడి నుంచి 12 మందిని ఇక్కడ ఎలా నియమించారో అర్థం కావడం లేదన్నారు. అనంతరం జేసీ రాహుల్‌మీనాకు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్వేయర్ల బదిలీ ఉత్తర్వులను తిరిగి పరిశీలించాలని సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)



గాంధీనగర్: టమాటా - 30, వంకాయలు - 36, 56, బెండకాయలు - 20, పచ్చిమిర్చి - 32, కాకరకాయ - 34, బీర - 24, 30, క్యాబేజీ - 34, క్యారెట్ - 36, 40, దొండకాయలు - 34, బంగాళాదుంపలు - 30, 36, ఉల్లి - 47, 57, గోరుచిక్కుడు - 32, దోసకాయలు - 34, అనపకాయ - 25, 30, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 60, 100, చేమదుంపలు - 46, మునగకాడలు - 12, 15, బీట్‌రూట్ - 34, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 52, క్యాప్సికం - 68, బొబ్బర్లు - 50, చిలకడదుంపలు - 52, మామిడికాయ - 15, 18, నిమ్మకాయలు(డజన్) - 36, 54.

సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4ప్లెక్స్- దేవర పార్ట్ 1, దేవి మల్టీప్లెక్స్ 4ప్లెక్స్- దేవర పార్ట్ 1, లక్ష్మి- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సిటీసెంటర్ 1- దేవర పార్ట్ 1, సిటీసెంటర్ 2- దేవర పార్ట్ 1, శ్రీప్రియ - దేవర పార్ట్ 1, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1 (వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- దేవర పార్ట్ 1, శ్రీశ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.

సర్వేశాఖ ఏడీగా శ్రీనివాస్

కాకినాడ కలెక్టరేట్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డు కాకినాడ జిల్లా సహాయ సంచాలకుడిగా కట్టా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో పనిచేస్తున్న ఆయనను ఇక్కడ నియమించారు. కాకినాడ జిల్లా సహాయ సంచాలకుడు బి.లక్ష్మీనారాయణను తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు.

ఫోరెన్సిక్ పరీక్షల్లో కృత్రిమ మేధ

✦ కొత్త పోకడలతో సమర్థంగా నేరశోధన, కేసుల పరిష్కారం ✦ సిమ్లా- 2024 సదస్సులో నిపుణుల మనోగతం

ఈనాడు, కాకినాడ - న్యూస్‌టుడే, మసీదు సెంటర్: ఫోరెన్సిక్ వైద్య పరీక్షల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్, డిజిటల్ పోస్టుమార్టం వంటి సాంకేతికతలను వినియోగించుకుంటే.. నేర పరిశోధన, కేసుల పరిష్కారం మరింత సులభతరం అవుతాయని ఫోరెన్సిక్ వైద్య నిపుణులు వెల్లడించారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ఆడిటోరియంలో 'సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ వార్షిక సదస్సు గురువారం ప్రారంభమైంది. ఆర్ఎంసీలోని ఫోరెన్సిక్ మెడిసిన్- టాక్సికాలజీ విభాగం నిర్వహణలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి ఫోరెన్సిక్, మెడికోలీగల్, ఫోరెన్సిక్ సైన్స్ నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు అభిప్రాయాలు..

నిశిత పరిశీలనతో ఫలితాలు



న్యాయవ్యవస్థలో ఎన్నో కేసుల పరిష్కారానికి ఫోరెన్సిక్ విభాగం ఎంతగానో దోహదపడుతోంది. పాముకాటుతో మరణించినట్లు ఓ మృతదేహం పోస్టుమార్టం కోసం వచ్చింది. కరిచిన పామును సైతం చంపి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పరీక్షిస్తే ఆమె గుడ్డతో పీక నులమడం వల్ల చనిపోయిందని, తర్వాత పాముతో కాటు వేయించారని తేలింది. మృతికి కారణం పరీక్షల ద్వారా వెల్లడించొచ్చు.

- డాక్టర్ జయంతి యాదవ్, ఫోరెన్సిక్ నిపుణులు, ఏఐఐఎంఎస్, భోపాల్, మధ్యప్రదేశ్

ఏఐతో నిందితుల గుర్తింపు సాధ్యమే..



ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఏఐ ద్వారా నిందితులను, గుర్తుతెలియని మృతదేహాలను తెలుసుకోవచ్చు. బాంబు పేలుడు జరిగిన చోట నిందితుడు క్యాప్ పెట్టుకుని, మాస్క్ పెట్టుకుని బ్లాస్ట్ ముందు ఆ ప్రదేశాల్లో తిరుగుతూ ఉంటాడు. అలాంటి సమయంలో అతని కళ్లు మాత్రమే కెమెరాకు చిక్కుతాయి. ఆ కళ్లు, నుదురు, మొహంలోని కొలతల ఆధారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నిందితుడిని కనిపెట్టవచ్చు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఒక్క కర్ణాటకలో మాత్రమే ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ పోస్టుమార్టం నిర్వహిస్తారు.

- డాక్టర్ బృంద జె.బట్, శ్రీనివాస్ వైద్య కళాశాల మంగుళూరు, కర్ణాటక,

సాంకేతికతతో క్షణాల్లో ఫలితాలు



అది సహజ మరణమని తెలిసినా.. ఆ దెబ్బలకు వేరే కారణం ఉందా అనేది ఫోరెన్సిక్ పరీక్షలతో చెప్పగలం. హత్య, ఇతరత్రా కేసుల్లో ఎముకల ద్వారా వయసు, లింగ నిర్ధారణ.. అత్యాచారం కేసుల్లో నమూనాల సేకరణ ద్వారా నేర నిర్ధారణకు అవకాశం ఉంది. ఏదైనా కేసును ఛేదించాలంటే.. ఒక వేలి ముద్రను మన దగ్గరున్న వెయ్యి వేలిముద్రలతోనే సరిపోల్చుతాం. దీనికి చాలా రోజులు పడుతోంది. అడ్వాన్స్‌డ్ డీప్ లెర్నింగ్, మిషన్ లెర్నింగ్(ఎంఐ)తో అన్ని నెట్‌వర్క్‌లతో అనుసంధానం చేస్తే క్షణాల్లో ప్రపంచంలోని అన్ని వేలిముద్రలతో పోల్చి కచ్చితమైన ఫలితం ఇస్తుంది.

- డాక్టర్ ఎస్వీ ఫణీంద్ర, ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు, ఎన్ఆర్ఐ వైద్యకళాశాల, గుంటూరు

ఊహకందని వాస్తవాలు తెలుసుకునే వీలు

మృతికి కారణాలు తెలుసుకోవడానికి కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. మన ఊహకు అందని వాస్తవాలు కూడా సాంకేతికతతో తెలుసుకునే వీలుంది. ఫోరెన్సిక్ విభాగంలో నిపుణులకు ఇలాంటి సదస్సులు వృత్తినైపుణ్యానికి ఉపకరిస్తాయి. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ ఫోరెన్సిక్ పోస్టుమార్టం లాంటి సాంకేతిక అంశాలు చర్చకు వచ్చాయి. నిష్ణాతులైన ఫోరెన్సిక్ వైద్యనిపుణులు అనుభవాలను వివరిస్తున్నారు. - డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, వైస్‌ప్రిన్సిపల్, రంగరాయ వైద్యకళాశాల



కార్మికురాలికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని 8, 9, 12 శానిటేషన్ సర్కిళ్లలోని ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది వైద్యాధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్మికులకు వ్యాక్సినేషన్ చేశారు. వార్డు సచివాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఫోన్లలో అన్‌వాంటెడ్ యాప్స్‌ను తొలగింపజేశారు. శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు రూ.లక్ష సాయం సముచితం

కాకినాడ నగరం: హజ్ యాత్రకెళ్లే ముస్లింలకు రూ.లక్ష సాయం అందించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కాలనీలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మసీదుల నిర్వహణకు రూ.5వేలు, నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు, కడపలో హజ్ హౌస్ నిర్మాణం వంటి హామీలు ముస్లింలకు ధైర్యాన్ని ఇచ్చాయన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత

మసీదుసెంటర్ (కాకినాడ): వివిధ ప్రాంతాల్లో 21 దొంగతనాలు చేసిన నేరస్థులను ఇటీవల అరెస్టు చేసి వారి నుంచి సొత్తును రికవరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుల్లో నిందితులను పట్టుకున్న సర్పవరం సీఐ పెద్దిరాజు, కాకినాడ సీసీఎస్ సీఐ వి.కృష్ణ, ఇతర సీసీఎస్, సర్పవరం పీఎస్ అధికారులు, సిబ్బంది, సాంకేతిక సహకారం అందించిన ఐటీ కోర్ హెచ్‌సీ ప్రసాద్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అదనంగా రూ.10 లక్షలు చెల్లించాలి

సెజ్ రైతుల ఆందోళన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి(కేఎస్ఈజెడ్)కి సేకరించిన భూములకు అదనపు నష్టపరిహారం ఎకరాకు రూ.10లక్షలు చెల్లించాలని బాధిత రైతులు గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. భూమి కోల్పోయిన ప్రతి రైతు కుటుంబానికి రెండు సెంట్ల ఇంటి స్థలాలు, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, లేకుంటే నెలకు నిరుద్యోగ భృతి రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తోటి చెంగలరావు మాట్లాడుతూ 2005లో ప్రభుత్వం యు.కొత్తపల్లి మండలం పొన్నాడ, మూలపేట, రమణక్కపేట, శ్రీరాంపురం పరిధిలో 10వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించిందన్నారు. రైతులను బెదిరించి భూములు లాక్కొన్నారన్నారు. తొలుత రూ.3 లక్షలు, తర్వాత రూ.2 లక్షలు మాత్రమే చెల్లించారన్నారు. ఇప్పటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా, ఆ భూములు బదలాయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో న్యాయం చేస్తామని జిల్లాకు చెందిన అప్పటి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద 30, 35, 36, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఉప కమిషనర్ ఎస్.మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. ఒక్కరికీ సొంత గృహాన్ని సాకారం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు నిర్మిస్తామన్నారు. గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేయవచ్చన్నారు. స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, తెదేపా నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తెదేపా నాయకులు నల్లూరి శ్రీనివాస్, సంగిశెట్టి అశోక్, బచ్చు శేఖర్, ఎస్‌కే రహీం, మల్లాడి గంగాధర్, పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే మరమ్మతులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తప్పనిసరి పరిస్థితుల్లోనే తన ఛాంబరుకు మరమ్మతులు చేపడుతున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. మూడేళ్ల కిందట ఛాంబరును ఆధునికీకరించారని, ప్రస్తుతం లోపలి భాగం చెదతో నిండిపోయిందన్నారు. కిటికీలు లేవని, చెదల వాసనతో ఇక్కడి నుంచి విధులు నిర్వహించలేకపోతున్నామని అన్నారు. ప్రతిపైసా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వెచ్చిస్తున్నామన్నారు. నగరంలో చెత్త, వీధి దీపాల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. చెత్త సేకరణకు అవసరమైన మౌలిక వనరులకు నిధులు కేటాయిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు.

పీఆర్ ఎస్ఈగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ (పీఆర్) విభాగం పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ)గా ఏవీఎస్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మచిలీపట్నంలో పీఆర్ విభాగంలో ఈఈగా పనిచేస్తూ ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. ఇన్‌ఛార్జి ఎస్ఈగా వ్యవహరిస్తున్న కాకినాడ పీఆర్ ఈఈ జి.మల్లికార్జున నుంచి శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బందితో పాటు జిల్లాకు చెందిన పలువురు ఈఈ, డీఈ, ఏఈలు శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్సైజ్ డీసీగా చైతన్య మురళి

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా వై. చైతన్య మురళి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఎక్సైజ్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్‌రెడ్డి బదిలీపై శ్రీకాకుళం డీసీగా వెళ్లారు.

వాహన చోదకులకు జరిమానా, కౌన్సెలింగ్

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాలు నడిపిన 15 మందికి గురువారం జరిమానా విధించారు. అనంతరం వారికి డీఎస్పీ రఘువీర్ విష్ణు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి..రామారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన విచారణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని గోడారిగుంట మదర్ థెరిసా ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడు వేధింపులకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై గురువారం రెండో రోజు విచారణ కొనసాగింది. విచారణాధికారిణి, కాకినాడ మున్సిపల్ కమిషనర్ స్థానిక స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విచారణకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధానోపాధ్యాయుడు హాజరైన తన వాంగ్మూలమిచ్చారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను కమిషనర్ విచారించారు. వీరిని నుంచి వివరాలను నమోదు చేశారు. శుక్రవారం ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేయనున్నారు. దీని ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి 30న డెమో

కాకినాడ నగరం: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ స్వయంప్రతిపత్తి కళాశాలలో గెస్ట్ అధ్యాపకుని(సంస్కృతం) పోస్టు భర్తీకి ఈ నెల 30 డెమో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.బి.తిరుపాణ్యం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఆ రోజు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి చేనేత హస్తకళా ప్రదర్శనలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: దేవాలయం వీధిలోని పైండా వెంకటచలమయ్య కళ్యాణ మండపంలో ఈ నెల 27 నుంచి అక్టోబరు 13 వరకు చేనేత హస్తకళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చేనేత, జౌళి శాఖ ప్రోత్సాహంతో చేనేత, హస్తకళలను ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలను మధ్యాహ్నం 3 గంటలకు నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తారన్నారు.

కల్యాణం... కమనీయం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గాంధీనగర్: మెయిన్ రోడ్డు సీతారామస్వామి ఆలయంలో గురువారం శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాంగళ్య ధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం: డీవైఈవో



బాలికకు వివరిస్తున్న వెంకటేశ్వరరావు

కాకినాడ నగరం: లైంగిక వేధింపులు, అఘాయిత్యాల నియంత్రణకు కఠిన చట్టాలున్నాయని కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) కె.వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 'సేవ్ ద గర్ల్ చైల్డ్'పై మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ ఎంఈవో సీహెచ్ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార సరఫరాకు రూ.52 లక్షలు విడుదల

కాకినాడ కలెక్టరేట్: విజయవాడ వరద బాధితులకు కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేసిన ఆహార పొట్లాలు, మంచినీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బేకరీ సామగ్రికి కలెక్టర్ షాన్‌మోహన్ రూ.52 లక్షలు విడుదల చేశారు. 97 ఆహార పొట్లాలు, 1.50 లక్షల మంచినీటి ప్యాకెట్లు, 7వేల వాటర్ బాటిళ్లు, బేకరి సామగ్రిని నాలుగు వాహనాల్లో విజయవాడకు తరలించి వరద బాధితులకు పంపిణీ చేశారు. వీటిని సరఫరా చేసిన కాకినాడకు చెందిన దుకాణదారులకు గురువారం స్థానిక ప్రజారోగ్య విభాగం కార్యాలయంలో ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ ఆధ్వర్యంలో సొమ్ము పంపిణీ చేశారు.

అపార్టుమెంట్‌లలో చెత్త తరలించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ 12వ సర్కిల్ పరిధిలోని అపార్టుమెంట్లలోని చెత్తను తరలించాలని గురువారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్‌కు అపార్ట్‌మెంట్ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సర్కిల్‌లో చెత్తను తరలించే కాంపాక్టర్ వాహనం మరమ్మతుకు గురైందని, 50 రోజులుగా చెత్త తరలింపు నిలిచిపోయిందని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించాలని కోరారు. సెల్లార్ల కింద చెత్త రోజులతరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో సోమిశెట్టి నాగేశ్వరరావు, డీబీ విజయకుమార్, తాతోలు నాగభూషణం, గోడి వెంకట్ ఉన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: ఘాటీసెంటర్‌లోని గంటి మోహనచంద్ర బాలయోగి ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు కాకినాడ ఆర్టీసీ అధికారులు గురువారం ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. పదో తరగతి చదివే బాలికలకు, ఏడో తరగతి లోపు బాలురకు ఈ పాస్‌లను పంపిణీ చేసినట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు రూ.50 మెడికవర్ హాస్పటల్ యాజమాన్యం అందించినట్లు పేర్కొన్నారు. ఎం.సుధాకర్‌రావు, హెచ్‌ఎం బీవీ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

కొండ నాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడిన చందంగా తయారైంది జేఎన్‌టీయూకే పరిస్థితి. సాంకేతిక విద్యాలయంలో సాంకేతికత లోపించడంతో జేఎన్‌టీయూకే చినుకు పడితే చెరువులా మారిపోతుంది. గతంలో చిన్నపాటి వర్షానికి రోడ్లనీ మునిగిపోతుండటంతో ఎత్తు చేసేందుకు ప్రణాళికలు వేశారు. రూ.లక్షలు ఖర్చు చేసి సిమెంట్ రహదారులు నిర్మించారు. ముందుచూపు లేకుండా వీటిని ఎత్తుగా నిర్మించడంతో అటు వర్సిటీ ప్రాంగణంలోని భవనాలన్నీ పల్లంగా మారాయి. మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ముంపు నీటితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అవగాహన లేకుండా చేస్తున్న పనులతో జేఎన్‌టీయూకే ముంపులో చిక్కుకుంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. -న్యూస్‌టుడే, గాంధీనగర్



ఎన్‌సీసీ భవన్ వద్ద ఇలా..



యూసీఈకే ప్రిన్సిపల్ కార్యాలయం వెనుక సివిల్ ఇంజినీరింగ్ విభాగం పక్కన నీరునిల్వ



కంప్యూటర్ సైన్స్ పీజీ బ్లాక్ వద్ద దుస్థితి



ప్రతినిధులను అభినందిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

చిన్న రైస్‌మిల్లుకు సీఎంఆర్‌లో భాగస్వామ్యం

ఎమ్మెల్యే, మాజీ మంత్రి చినరాజప్ప

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రానున్న ఖరీఫ్ ధాన్యం సేకరణలో తక్కువ సామర్థ్యం ఉన్న రైస్ మిల్లులకు సీఎంఆర్‌లో భాగస్వామ్యం కల్పిస్తామని ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక రైస్‌మిల్లర్ల సంఘ భవన్‌లో సంఘ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వల్లూరి సూర్యప్రకాశరావు(సూరిబాబు) అభినందన సభ నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే రాజప్ప అతిథిలుగా హాజరయ్యారు. వైకాపా ప్రభుత్వంలో చిన్న రైస్‌మిల్లర్లు చాలా ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే రాజప్ప అన్నారు. రైస్‌మిల్లర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నున్న రామకృష్ణ, రాష్ట్ర కోశాధికారి నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాల అందజేత

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎంపీహెచ్ఏ(ఎం) నియామాలకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశామని డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ తెలిపారు. గురువారం 185 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా నియామక పత్రాలను అందజేశామన్నారు.

తాత్కాలికంగా నిరసన విరమణ

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు కాకినాడ జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు చిన్నారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విధులకు ఆటంకం కలగకుండా రోజూ రెండు గంటల పాటు శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల పాటు సమయం ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు.

తాగి వాహనం నడిపిన ఆరుగురికి జైలు

మసీదుసెంటర్ (కాకినాడ): మద్యం తాగి వాహనం నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు.

మెటీరియల్స్ రంగంలో అవకాశాలు



ప్రసంగిస్తున్న జేఎన్‌టీయూకే రెక్టార్ రమణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మెటీరియల్స్ రంగంలో అనేక అప్లికేషన్‌లు రూపొందించేందుకు అవకాశం ఉందని జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ అన్నారు. జేఎన్‌టీయూకే యూసీఈకే మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసస్ అంశంపై మూడు రోజులు నిర్వహించనున్న వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, యూసీఈకే ప్రిన్సిపల్ ఎన్.మోహనరావు, రీసోర్స్‌పర్సన్ ఎస్.సాయికుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డి.లింగరాజు, కోఆర్డినేటర్ జయప్రసాద్, కల్యాణ్ మనోహర్, డైరెక్టర్లు, విభాగాధిపతుల పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం


ఎంపికైన క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయిని, పీఈటీ

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

సామర్లకోట: జిల్లా స్థాయి ఆటల పోటీలకు సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు 16 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని యు.మీనామాధురి తెలిపారు. 14, 17 సంవత్సరాలలోపు విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను, వ్యాయామోపాధ్యాయిని జి.శ్రీదేవిని అభినందించారు.

బాలికలకు ఆటల పోటీలు

పెద్దాపురం: నియోజకవర్గస్థాయి అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు పట్టణంలోని మహారాణి కళాశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణం, మండలం నుంచి బాలికల జట్లు పాల్గొన్నాయి. వ్యాయామోపాధ్యాయులు వరసాదనం, ఉమామహేశ్వరరావు, కామిరెడ్డి సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న బాలికలు

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతలతో ఇబ్బందులు

సమస్య: పెదపూడి- వేట్లపాలెం రోడ్డు గుంతలు పడటంతో ప్రయాణికులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. **- స్థానికులు, పెదపూడి**

సమాధానం: రోడ్డును పరిశీలించి గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం. **- లోవరాజు, ఏఈ, ర.భ.శాఖ, పెదపూడి**

మురుగు కాలువలు నిర్మించారు...

సమస్య: పాతర్లగడ్డలో డ్రెయినేజీలు లేక మురుగునీరు ఇంటి వద్ద నిలిచిపోతోంది. **- పి.రాంబాబు, గ్రామస్థుడు.**

సమాధానం: డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి నిధులు మంజూరు కాగానే నిర్మించేందుకు చర్యలు చేపడతాం. **- కె.అప్పారావు, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, పెదపూడి, కరప

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: **80085 74325** పెద్దాపురం: **80085 74198,** పిఠాపురం: **80085 65544**

సత్వరమే స్పందించి.. పరిహారం అందించి..

• సాయం మంజూరుపై వరద బాధితుల ఆనందం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, ఏలేరు వరదల్లో ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు, పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసింది. వరదల సమయంలో అల్పాహారం, భోజనాలు, బియ్యం, నిత్యావసర సరకులు అందించడంతోపాటు ఇప్పుడు బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కావడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 4,745 గృహాలు వరద ముంపునకు గురికావడంతో రూ. 10 వేలు చొప్పున రూ. 4.74 కోట్లు మంజూరు చేశారు. నియోజకవర్గంలో 12,285 మంది రైతులకు చెందిన 17,857 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా ఎకరాకు రూ. 10 వేలు చొప్పున ప్రభుత్వం రూ. 17,85,70,000 నష్టపరిహారం విడుదల చేసింది. పిఠాపురం మండలంలో 42 మంది రైతులకు చెందిన 46 ఎకరాల్లో ఉద్యాన పంటలు నాశనమయ్యాయి. రైతులు, కౌలుదారులు బ్యాంకు ఖాతాల్లో బుధవారం సాయంత్రం నుంచి జమ అవుతుండటంతో కూటమి ప్రభుత్వం సత్వరం స్పందించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపోయిన రైతులు.. వరద బాధితుల వివరాలు..

మండలం	రైతులు	విస్తీర్ణం (ఎకరాల్లో)	వరద బాధితులు
పిఠాపురం	4,999	6,894	1,565
గొల్లప్రోలు	3,570	4,984	2,071
యు.కొత్తపల్లి	3,716	5,933	1,109


యూనియన్ బ్యాంకులో సొమ్ము తీసుకునేందుకు వచ్చిన వరద బాధితులు

సకాలంలో ఆదుకున్నారు...



గతంలో ఎన్నడూ లేనివిధంగా వరద బాధితులను సకాలంలో ఆదుకున్నారు. వరదల సమయంలో అల్పాహారం, భోజనాలు, నిత్యావసర సరకులు ఇచ్చారు. ఇప్పుడు రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వల్ల వెంటనే సాయం అందింది. **- దెయ్యాల మహాలక్ష్మి, జగనన్న కాలనీ, గొల్లప్రోలు**

పది రోజుల్లోనే సాయం అందింది



గొల్లప్రోలులోని 1.20 ఎకరాల్లో పంట ముంపునకు గురై నాశనమయింది. పంట నష్టం జరిగిన 10 రోజుల్లోనే ఎకరాకు రూ. 10 వేలు చొప్పున రూ. 12,200 బ్యాంకు ఖాతాలో జమ చేశారు. జగనన్న కాలనీలో ఇల్లు ముంపునకు గురికావడంతో భార్య పేరిట రూ. 10 వేలు అందించారు. **- అడబాల శివ, రైతు**

అన్నవరంలో నెయ్యి నాణ్యతపై అనుమానాలు: వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తిరుమల లడ్డూలో కల్తీ జరిగినట్టుగా, అన్నవరం సత్యదేవుని ప్రసాదంలో వినియోగించిన నెయ్యి నాణ్యతపైనా అనుమానాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. గురువారం పిఠాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైకాపా నేతల ఒత్తిడితో రెండేళ్ల నుంచి రైతు డెయిరీ పేరుతో నెయ్యి సరఫరా చేశారన్నారు. సింహాచలం దేవస్థానానికి రూ. 344కే నెయ్యి సరఫరా చేసి, అన్నవరానికి రూ. 538కి ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు.

రూ. 36 లక్షలతో పూడికతీత పనులు

సామర్లకోట, న్యూస్‌టుడే: పట్టణంలో ముంపు నివారణకు రూ. 36 లక్షలతో మేజర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో జరుగుతున్న పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు చేయూత

తాళ్లరేవు: జి.వేమవరం మత్స్యకారకాలనీకి చెందిన నిరుపేదలు దొరబాబు, దుర్గల కుమారుడు, ఇంటర్ విద్యార్థి శరత్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇతని వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే నగదుకాకుండా ప్రత్యేకంగా వైద్య పరీక్షలకు రూ.5 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు సూచించారని బాధితుని కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. సాయం అందించేందుకు జి.వేమవరం కూటమి నాయకులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి దాతల సహకారంతో రూ.80 వేలు సేకరించి ఇచ్చినట్లు తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు గండి అప్పారావు, జనసేన నాయకుడు పుణ్యమంతుల సత్తిబాబు తెలిపారు.


జి.వేమవరంలో సాయం అందిస్తున్న దాతలు

బాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, ఏలేరు వరద ముంపునకు గురై నష్టపోయిన, ఉపాధి అవకాశాలు కోల్పోయిన బాధితులకు సత్వర సాయం అందించడంపై ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీపేట, జగనన్న కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. జనసేన నాయకులు, జనసైనికులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఎస్సీపేటలో సీఎం చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ చిత్రపటాలకు వరద బాధితులు క్షీరాభిషేకం చేశారు. తెదేపా నాయకులు దొమ్మేటి మనోహర్, గంధం మహేష్, గంధం నాగేశ్వరరావు, బచ్చుల చినబాబు, అరుణ్‌కుమార్, పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న బాధితులు, జనసైనికులు

దీపావళికి ఉచిత సిలిండరు పథకం అమలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: ప్రజలకిచ్చిన మాట ప్రకారం దీపావళికి కూటమి ప్రభుత్వం ఉచిత సిలిండరు పథకాన్ని అమలు చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ముప్పన సోమరాజు వీర్రాజు కల్యాణ మండపంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సంక్రాంతికి తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి(బాబు) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

కరప: గురజనాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు.

పెదపూడి: పైన గ్రామంలో మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి విజన్ 2047 పోస్టరును ఆవిష్కరించారు.

తాళ్లరేవు: తెదేపా క్లస్టర్ సమన్వయకర్త టేకుమూడి లక్ష్మణరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంచారు.


గురజనాపల్లిలో స్టిక్కర్లు అతికిస్తున్న పిల్లి సత్యనారాయణమూర్తి, అనంతలక్ష్మి

సినిమా థియేటర్లలో తనిఖీలు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోటలోని జయలక్ష్మి, విఘ్నేశ్వర థియేటర్లలో తహసీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి గురువారం తనిఖీలు చేశారు. శుక్రవారం దేవర సినిమా విడుదల కారణంగా ప్రేక్షకుల రద్దీకి అనుగుణంగా యజమానులు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా టిక్కెట్ల ధరలు ఉండాలని సూచించారు. థియేటర్లలో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పిఠాపురం, న్యూస్‌టుడే: వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. గురువారం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో 'నా మొక్క.. నా శ్వాస' కార్యక్రమంలో ఆయన పాల్గొని పిఠాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఏటా వర్షకాలంలో వేల సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు చెప్పారు. పచ్చదనంతో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కాలుష్యం బారి నుంచి విముక్తి పొందాలంటే మొక్కలు ఉండాలన్నారు. కమిషనర్ కనకారావు, రీజనల్ బయో డైవర్సిటీ కోఆర్డినేటర్ శ్రీ సత్యప్రసాద్, రైల్వే యూనియన్ ఛైర్మన్ టి.ఈశ్వరరావు, స్టేషన్ మాస్టర్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఉమర్ ఆలీషా, కమిషనర్ కనకరావు

సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలి

పెద్దాపురం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలని ఇస్రో ప్రధాన ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ మూర్తి రామెల్లా (బెంగళూరు) అన్నారు. గురువారం ఆయన పెద్దాపురం మహారాణి కళాశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చంద్రుడి ఉపరితలంపై రోవర్ సురక్షిత ల్యాండింగ్, అక్కడి విశేషాలను ప్రపంచానికి తెలియజేయడానికి తమ వంతు సహకారం అందించడానికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి, విశ్రాంత అధ్యాపకుడు షేక్ ముస్తఫా, కళాశాల పూర్వ విద్యార్థి, విశాఖ స్టీల్ ప్లాంట్ ఇంజినీరు పీసపాటి వెంకటేశ్వరరావు మాట్లాడారు.

దుర్గమ్మ విగ్రహం తొలగింపుపై ఆందోళన

కొత్తపల్లి, న్యూస్‌టుడే: గ్రామకంఠం భూమిలో ఉన్న దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని కొందరు వ్యక్తులు తొలగించి రహదారిపై ఉంచడంతో గురువారం నాగులాపల్లిలో వివాదం తలెత్తింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు, గ్రామ శివారు వంతెన సమీపంలోని స్థలంలో దుర్గాదేవి ఆలయం నిర్మించేందుకు పాత ఆలయాన్ని ఇటీవల తొలగించారు. స్థలం పక్కనే ఉన్న ఇంటి యజమానులు ఆలయ స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మించారు. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు విచారణ చేసి ఆ స్థలం గ్రామకంఠంలో ఉందని నిర్ధారించి గోడను తొలగించి హెచ్చరిక బోర్డు పెట్టారు. గురువారం ఉదయం గ్రామస్థులు ఆ స్థలంలో దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాత్రి 8 గంటల సమయంలో ఆ విగ్రహాన్ని నివాసితులు అక్కడి నుంచి తీసివేసి రహదారిపై పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భారీస్థాయిలో అక్కడకు చేరుకుని రహదారిపై బైఠాయించి ఆందోళన చేసి రాకపోకలు నిలిపివేశారు. భవానీ మాలధారులు రహదారిపై ఉన్న విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచి భక్తి పాటలు పాడుతూ ఆందోళన చేశారు. విగ్రహం తొలగించి తమపై కారంతో దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.


రహదారిపై గ్రామస్థుల నిరసన

అక్రమ కబేళాపై పోలీసుల దాడి

గొల్లప్రోలు: చెందుర్తి గ్రామ శివారు పుష్కర కాలువ గట్టుపై అక్రమంగా నిర్వహిస్తున్న కబేళాపై అదనపు ఎస్సై ఎన్.లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి రెండు సంచుల్లో ఉన్న పశు మాంసం, మూడు కత్తులు, రెండు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. కబేళా నిర్వహిస్తున్న సామర్లకోటకు చెందిన మహమ్మద్ అఫ్సర్ ఆలం, మహమ్మద్ సబాబ్ ఆలం, పిఠాపురానికి చెందిన ఆరుగుళ్ల సామ్యూల్, ఆరుగుళ్ల ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంట పొలాల్లో ముంపు నీరు తొలగింపు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వరదలు, వర్షాలతో పొలాలు మునిగి పంట నష్టం ఏర్పడుతోందని లచ్చిపాలెం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కాళ్ల గణపతి, తెదేపా క్లస్టర్ సమన్వయకర్త మోపూరి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లరేవు మండలం వృద్ధ గౌతమి గోదావరి నుంచి లచ్చిపాలెం వంతెన వరకు మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త, మట్టి తొలగింపు పనులను యంత్రంతో చేపట్టారు. ఆంధ్ర, యానాం అధికారుల సమన్వయంతో వారం రోజులుగా పూడిక పనులు చేస్తున్నారని రైతులు తెలిపారు. ముంపు సమస్య పరిష్కారమైందని 1200 ఎకరాల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


లచ్చిపాలెంలో పూడిక తీస్తున్న యంత్రం

జగ్గంపేటలో అత్యధిక వర్షపాతం

పెద్దాపురం: పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగ్గంపేట మండలంలో అత్యధికంగా 25.4 మి.మీ వర్షపాతం నమోదైందని పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు మండలాలవారీగా కోటనందూరు 9.4, రౌతులపూడి 7.2, శంఖవరం 1.0, ఏలేశ్వరం 19.4, కిర్లంపూడి 21.4, ప్రత్తిపాడు 8.6, తొండంగి 4.6, పెద్దాపురం 8.2, తుని 5.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

ఏలేరు వరద బాధితులను ఆదుకోవాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలేరు వరద ముంపు బాధితులను ఆదుకోవాలని పిఠాపురం నియోజకవర్గం వైకాపా కో-ఆర్డినేటర్, మాజీ ఎంపీ వంగా గీత కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె వైకాపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలసి కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె కలెక్టరేట్ బయట విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో నెయ్యి అంశం చాలా సున్నితమైనదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి వాస్తవాలు బయట పెట్టాలన్నారు.


ప్రాజెక్టులను పరిశీలించి మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

చెత్త నుంచి సంపద ప్రాజెక్టుల ప్రదర్శన

సామర్లకోట: అయోధ్యరామపురంలోని బచ్చు ఫౌండేషన్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పురపాలక పాఠశాలల విద్యార్థులు చెత్త, వ్యర్థాల నుంచి సంపద ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనరు ఎ.శ్రీవిద్య పాల్గొన్నారు.

పురోగతిపై సమీక్షిద్దాం..

సర్పవరం జంక్షన్: ది జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీ పర్పస్ సొసైటీ లిమిటెడ్ తృతీయ మహాజన సభ కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నామని ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు తెలిపారు. సంఘ డిపాజిట్‌దారుల మేలు కోసం ప్రస్తుత బోర్డు చేపట్టిన చట్టపరమైన చర్యలు, పురోగతిని వివరిస్తామన్నారు. సర్పవరం జంక్షన్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

సర్పవరం జంక్షన్, పిఠాపురం, కరప, న్యూస్‌టుడే: తహసీల్దార్లుగా కాకినాడ గ్రామీణ మండలంలో ఎస్ఎల్ఎన్ కుమారి, పిఠాపురంలో పీవీవీ గోపాలకృష్ణ, కరపలో నందిపాటి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా లక్ష్మీనారాయణ..

సర్పవరం జంక్షన్: సర్పవరంలో భావనారాయణస్వామి ఆలయ ఈవోగా మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

సామర్లకోట, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు సామర్లకోటకు చెందిన చింతపల్లి నూకరాజు(45)కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. 2019లో సామర్లకోటకు చెందిన దివ్యాంగురాలిపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. బాధితురాలి మేనత్త కుమారుడు ఎం.అరుణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాది తరపున వాదనలు వినిపించారన్నారు. ఈ కేసు దర్యాప్తులో సహకరించిన హెడ్ కానిస్టేబుల్ బీఎన్ రాజును జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు.

పెద్దాపురం నియోజకవర్గంలో రూ.4.72 కోట్ల పంట నష్టం

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఏలేరు వరద ఉద్ధృతికి పెద్దాపురం మండలం, సామర్లకోట పట్టణ పరిధిలో వరి పంట నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెద్దాపురం మండలంలో కట్టమూరు, జె.తిమ్మాపురం, సిరివాడ, గుడివాడ, దివిలి, వడ్లమూరు, కాండ్రకోట, మర్లావ, పులిమేరు, గోరింట, జి. రాగంపేట.. సామర్లకోట పట్టణ పరిధిలో పిఠాపురం వెళ్లే రహదారిలోని పంట పొలాల్లోకి నీరు చేరింది. సుమారు ఐదు రోజులపాటు నీరు పొలాల్లో నిల్వ ఉండటంతో చేతికి రావాల్సిన పంట పాడైపోయి రైతులు నష్టపోయారు. వివరాల సేకరణలో వ్యవసాయశాఖాధికారులు తలమునకలై ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పెద్దాపురం నియోజకవర్గంలో రూ. 4.72 కోట్ల పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. రైతులు తమ ఆధారాలతో కూడిన పత్రాలను తీసుకొని వ్యవసాయశాఖ కార్యాలయాలను సంప్రదించాలని ఏవోలు సంజయ్‌కుమార్, సత్య కోరారు.

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	నష్టపోయిన పంట	రైతులు	పంట నష్టం (రూ.కోట్లలో)
పెద్దాపురం	9,500	2,434	1,598	2.43
సామర్లకోట	22,000	2,294	1,213	2.29


పెద్దాపురం నుంచి గుడివాడ వెళ్లే రహదారిలో పాడైన వరి పంట

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

పారదర్శకంగా రికార్డుల పరిశీలన



వీఆర్వోలు, సర్వేయర్లకు సూచనలిస్తున్న ఆర్డీవో సీతారామారావు

తుని గ్రామీణం(కోటనందూరు): దశాబ్దాలుగా అసైన్డు భూములను సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు, రికార్డులను పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవో సీతారామారావు సూచించారు. కోటనందూరు తహసీల్దారు కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, సర్వేయర్లతో ఈ విషయమై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కోటనందూరు మండల పరిధిలో సుమారు 124 ఎకరాల అసైన్డ్ భూముల సుమారు 171 మంది రైతులు సాగు చేస్తున్నారని గుర్తించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హైవే సిబ్బంది స్వచ్ఛతా ర్యాలీ

ప్రత్తిపాడు: హైవే అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని ధర్మవరం గ్రామంలో 'స్వచ్ఛతా హీ సేవ' ర్యాలీ గురువారం జరిగింది. హైవే నిర్వహణ సిబ్బంది విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలు శుభ్రం చేశారు. గ్రామంలోని ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రామ్మూర్తి, టోల్ గేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మవరంలో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ర్యాలీ

సిమెంట్ పలక మార్చారు

ఈనాడు కథనానికి స్పందన

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయినగర్ కూడలిలో కల్వర్టుపై ఉన్న సిమెంట్ పలక శిథిలమై ప్రమాదఘంటికలు మోగుతున్నాయని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పురపాలక ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. జేసీబీతో పాత పలకను తొలగించి కొత్తదానిని ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లింగంపర్తిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఇళ్లనిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మల్లిఖార్జునరావు అన్నారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ ప్రగతిపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మణికంఠ, ఏపీవో రాజగోపాల్, ఈవోపీఆర్డీ కె.వి. సూర్యనారాయణ, ఎంఈవో అబ్బాయి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. గతంలో ఇళ్లస్థలాలు పొందిన లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలసి నిర్మాణాలను పూర్తిచేసేలా కృషిచేయాలని ఆదేశించారు. అనంతరం లింగంపర్తి, తదితర గ్రామాల్లో లేఔట్లను అధికారులు సందర్శించారు. తరచూ గ్రామాలను సందర్శించడం ద్వారా నూరుశాతం లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రత్యేకాధికారి తెలిపారు.

సంపద కేంద్రాలకు మంచి రోజులు



జె.కొత్తూరులో నిరుపయోగంగా ఉన్న సంపదకేంద్రం

న్యూస్‌టుడే- జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి

పల్లెలను సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చే ఆలోచనతో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలు లక్ష్యానికి ఆమడదూరంలో ఉండిపోయాయి. జగ్గంపేట నియోజకవర్గంలో కొన్ని కేంద్రాలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందినప్పటికీ తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో క్రమంగా మూలకు చేరాయి. గ్రామాల్లో చెత్త సేకరణ సంగతి ఎలా వున్నా కేంద్రాల నిర్వహణకు కనీసం ఒక్కపైసా లేకుండాపోయింది. దీంతో వాటికి నిర్వహణ కరవైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాంధీ జయంతి నుంచి సంపదకేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని సంకల్పించడంతో లక్ష్యం నెరవేరాలని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

గతమెంతో ఘనం..

కిర్లంపూడి మండలంలోని సంపద కేంద్రాలు 2014-19లో అప్పటి ప్రభుత్వ పాలనలో పాలకులు, అధికారులను ఆకర్షించాయి. బూరుగుపూడి పంచాయతీలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రం అప్పట్లో ఆదర్శ కేంద్రంగా నిలిచింది. ఆంధ్ర, తెలంగాణాలతోపాటు ఇతర రాష్ట్రాల అధికారులు ఇక్కడకు అధ్యయనానికి వచ్చారు. ఇంటింటా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించి వాటిని సేంద్రియ ఎరువులుగా తయారుచేసి అమ్మడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే వారు. సుమారు 50 మంది సిబ్బందికి ఉపాధి కల్పించారు. ఈ కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని మండలంలో మిగిలిన చోట్ల కూడా ఉత్సాహంగా పనిచేశాయి. తర్వాత మారిన పరిస్థితుల కారణంగా గత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో బూరుగుపూడితో సహా సంపదకేంద్రాలు ఉనికిని కోల్పోయాయి.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పంచాయతీలు	సంపదకేంద్రాలు
జగ్గంపేట	16	16
కిర్లంపూడి	19	19
గండేపల్లి	18	18
గోకవరం	14	14

● జగ్గంపేట మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. కాట్రావులపల్లి, రామవరంలో షెడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. మిగిలిన అన్ని గ్రామాల్లోనూ షెడ్లనిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టినప్పటికీ అరకొరగానే వినియోగిస్తున్నారు. మల్లిపాక, కాండ్రేగుల, గొల్లలగుంట, జె.కొత్తూరు తదితర గ్రామాల్లో రోడ్లపై చెత్తను డంప్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతుండగా స్థానికులు వాపోతున్నారు. రూ.లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు అక్కరకు రాకుండా పోవడం, పర్యవేక్షణ లోపించడంతో సాయంత్రం మందు బాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని పలువురు చెబుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం..

గ్రామాల్లోని సంపద కేంద్రాలను అక్టోబరు 2 నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే ఈ విషయం గ్రామ కార్యదర్శులకు తెలియజేశాం. అసంపూర్తిగా ఉన్న షెడ్లను పూర్తి చేసి, అన్నింటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

\- ఎం. శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

తుని, న్యూస్‌టుడే : పట్టణంలోని రెడ్‌క్రాస్ వీధి రోటరీహాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ కోశాధికారి కర్రి కిషోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హైమా నేత్రాలయం వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తెచ్చుకోవాలన్నారు.

బాధితుడికి సహాయం

తుని పట్టణం, న్యూస్‌టుడే : ఎర్రకోనేరుకు చెందిన ఆదినారాయణ గుండె శస్త్రచికిత్స నిమిత్తం శ్రీస్వర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.40లక్షల సహాయాన్నిగురువారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సొమ్మును అనేక కళాశాలలు, దాతల నుంచి సేకరించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు తెలిపారు.

నేడు సమావేశం

తుని, న్యూస్‌టుడే : తెదేపా క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఏజెంట్లతో ఎమ్మెల్యే దివ్య శుక్రవారం ఉదయం 9.30కు సమావేశం అవుతారని పార్టీ నాయకులు తెలిపారు. సాయివేదిక ఫంక్షన్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

అవీ ఇవీ అన్నీ

కేంద్రాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుని: అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నామని సీడీపీవో కె.శ్రీలత తెలిపారు. మండలంలో రాపాక (ఓసీ,డబ్ల్యు), తుని పట్టణ పరిధిలో కొండవారిపేట (బీసీ-ఎ), గవరపేట(ఓసీ)లలో ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వరికి ఎండు తెగులు ముప్పు

గండేపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో ఎండు తెగులు ఎక్కువగా వస్తుందని మండల వ్యవసాయాధికారి సద్గురుమూర్తి తెలిపారు. పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

రేపు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

తొండంగి: తొండంగి ఎంపీపీ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు ఉంటుందని ఎంపీడీవో మార్కండేశ్వరరావు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: నీలాద్రిరావుపేట శివారు కార్తికేయ ఆసుపత్రిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఛైర్మన్ రమణ తెలిపారు. శిబిరంలో గైనిక్, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అవినాష్, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

జగన్‌ను కలిసిన కృష్ణుడు

తుని: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని కార్యాలయంలో గురువారం యనమల కృష్ణుడు కలిశారు. వీరిరువురు వివిధ అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

దశలవారీగా నియోజకవర్గ అభివృద్ధి

తొండంగి, న్యూస్‌టుడే: తుని నియోజకవర్గాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శృంగవృక్షం, అద్దరిపేట, యల్లయ్యపేట, జీఎంపేట గ్రామాల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దివ్య పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. నాయకులు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ, మోతుకూరి వెంకటేష్, దూలం మురళి, వీరబాబు, అప్పారావు, బంటుపల్లి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన



శంఖవరంలో బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండపం గ్రామంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం- ప్రజా వేదిక' లో ఆమె పాల్గొని మాట్లాడారు. 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. తెదేపా నియోజకవర్గ యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్ మండపం గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు, పోలం చిన్న తదితరులు పాల్గొన్నారు.

● శంఖవరంలో ఎమ్మెల్యే సత్యప్రభ ఉన్నత, ఆం.ప్ర. ఆదర్శ పాఠశాల విద్యార్థులకు దాత కొత్తూం నాగు అందించిన బస్‌పాస్‌లను అందజేశారు.

'దురుద్దేశంతోనే తిరుమలకు జగన్'

దేవీచౌక్, న్యూస్‌టుడే: తితిదే నిబంధనలకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిక్లరేషన్ ఇచ్చాకే స్వామిని దర్శించుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మత సామరస్యాన్ని పరిరక్షించేందుకు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. లడ్డూ కల్తీపై నెలకొన్న వివాదం నేపథ్యంలో రాజకీయ దురుద్దేశంతోనే ఆయన వెళ్తున్నట్లు అర్థమవుతోందన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ నాయకుడిగా రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని జగన్ కోరుకుంటే ధార్మిక సంఘాలు, నేతల డిమాండ్ ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. సీఎంగా ఉన్నప్పుడు నియమాలు పట్టించుకోకపోవడంతోనే ఇప్పుడు అనర్థాలు జరుగుతున్నాయన్నారు. తన పాలనలో తప్పు జరిగింది కాబట్టి అక్కడ ప్రక్షాళన చేసుకుంటానని చెప్పడానికే జగన్ తిరుమల వెళ్తున్నట్లు భావిస్తున్నానన్నారు. అది కాకపోతే రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నించినట్టేనన్నారు. మత సామరస్యం దెబ్బతీయడానికి వైకాపా కుట్ర చేస్తోందన్నారు. సిట్‌పై నమ్మకం లేదంటే, గతంలో జగన్ వేసిన సిట్‌లు తప్పు చెప్పాయా అని ప్రశ్నించారు. నాణ్యత అనేది ల్యాబ్ లోనే తేలాల్సిన అవసరం లేదని, ప్రజలే చెబుతున్నారన్నారు. పాత కంపెనీని కాదని, గత ప్రభుత్వం వేరే వేరే కంపెనీలకు ఎందుకు ఇచ్చిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

'ఆయనలో మార్పు రాదంతే..'

జగన్‌ను దగ్గరగా చూసిన వాడిగా చెబుతున్నా ఆయనలో మార్పు రాదన్నారు. పవన్‌కళ్యాణ్‌పై ప్రకాష్‌రాజ్ కామెంట్లు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే సంపూర్ణ నమ్మకం ఇచ్చిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిందన్నారు. జగన్ అయిదేళ్లల్లో రూ.1000 పెంచితే తమ ప్రభుత్వం ఒకేసారి చేసిందన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు.

విజయవాడ దసరా వేడుకలకు అన్నవరం సిబ్బంది

అన్నవరం, న్యూస్‌టుడే: అక్టోబరు 3 నుంచి 15 వరకు విజయవాడ దసరా ఉత్సవాలకు అన్నవరం దేవస్థానం ఉద్యోగులు పలువురికి విధులు కేటాయిస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, కంప్యూటరు ఆపరేటర్లు మొత్తం 22 మందికి విధులు కేటాయించారు.

లోవ దేవస్థానంలో ముగ్గురు అధికారుల బదిలీ

తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో కార్యాలయ సిబ్బంది ముగ్గురు బదిలీ అయినట్లు డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు. కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జాజిమొగ్గల రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న జి.మనోజ్‌కుమార్, ఎం.రామచంద్రకుమార్‌కు బదిలీ అయినట్లు డీసీ తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అదనంగా రూ.10 లక్షలు చెల్లించాలి

కాకినాడ కలెక్టరేట్: కేఎస్ఈజడ్‌కు సేకరించిన భూములకు అదనపు నష్టపరిహారం ఎకరాకు రూ.10లక్షలు చెల్లించాలని బాధిత రైతులు గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తోటి చెంగలరావు మాట్లాడుతూ 2005లో ప్రభుత్వం యు.కొత్తపల్లి మండలం పొన్నాడ, మూలపేట, రమణక్కపేట, శ్రీరాంపురం పరిధిలో 10వేల ఎకరాలకు పైగా భూమి సేకరించిందన్నారు. రైతులను బెదిరించి భూములు లాక్కొన్నారన్నారు. గత ప్రభుత్వంలో న్యాయం చేస్తామని జిల్లాకు చెందిన అప్పటి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా నెరవేలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు.

రైల్వే స్టేషన్ పరిశీలన



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న సుహాసినీ ఎస్.గోత్మరే

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం రైల్వే స్టేషన్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సుహాసినీ ఎస్.గోత్మరే గురువారం పరిశీలించారు. స్టేషన్ అధికారులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించారు. క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం ఉందా లేదా అన్నది తనిఖీ చేశారు. ప్రయాణికుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందన

శంఖవరం: కత్తిపూడిలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైన శంఖవరం, కె.కొత్తూరు పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే సత్యప్రభ, ఎంఈవో రమణ, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా స్థాయిలోనూ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వాలని సూచించారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహిళా సంక్షేమానికి కృషి చేస్తుందని కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. ఏలేశ్వరం ప్రధాన రోడ్డు సమీపాన మెప్మా పరిధిలో పనిచేస్తున్న డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఉత్పత్తులను గురువారం వారు పరిశీలించారు. మెప్మా సమన్వయకర్త సాయికుమార్, పలువురు నాయకులు, కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుకాసురుల బరితెగింపు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏలేరు ప్రధాన కాలువల్లో వరద తగ్గడంతో ఇసుక జాతర ప్రారంభమైంది. పంటలు, కాలువలు ధ్వంసమై రైతులకు, ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదేమి పట్టించుకోని ఇసుక అక్రమార్కుల కళ్లు ఏలేరు కాలువలోకి కొట్టుకొచ్చిన ఇసుకపై పడింది. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రధాన కాలువలో ఇసుకను ఎడ్లబండ్లపై ఒడ్డుకు తెచ్చి గట్టుపై వేస్తుంటే దాన్ని ట్రాక్టర్లపై నింపి అమ్మకాలకు తరలిస్తున్నారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం నుంచి మొదలుకొని కృష్ణవరం, సోమరాయణింపేట, ఎస్.తిమ్మాపురం, పాలెం, గోనేడ, తామరాడ, రామచంద్రపురం తదితర గ్రామాల్లో ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతుంది. ప్రాజెక్టు నుంచి ఏలేరు కాలువలకు గత నాలుగు రోజులుగా నీటి విడుదలను 1800 క్యూసెక్కుల స్థాయికి తగ్గించారు. దీంతో వరదలకు కొట్టుకొచ్చిన ఇసుక కాలువల్లో మేటలు వేశాయి. వరద ఎప్పుడు తగ్గుతుందా అని గోతి కాడ నక్కల్లా కూర్చున్న ఇసుకాసురులు నీరు ఆగిందే తడవుగా తవ్వకాలకు రెక్కలు విచ్చుకున్నాయి. బహిరంగ మార్కెట్లో ట్రాక్టరు ఇసుక రూ.ఐదువేలకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే కాలువలకు తూట్లు పడడంతో గోతులు గొప్పులుగా మారాయి. వాటిలోకి చేరిన ఇసుకను అమ్మకాలకు అక్రమార్కులు తవ్వి తరలించేస్తున్నారు. దీంతో పంట కాలువలకు సాగునీరు పారే పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జలవనరులశాఖ అధికారులు స్పందించి ఏలేరు ప్రధాన కాలువల్లో ఇసుక తవ్వకాలను నిరోధించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఏలేరులో ఇసుక తవ్వకాల నిరోధానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ఏలేరు ప్రధాన కాలువలో ఎడ్లబండ్లపై ఇసుకను తరలిస్తున్నారిలా..

సామాజిక బాధ్యతను మరవొద్దు..



చేతికర్ర ఎలా ఉపయోగపడుతుందో చూపుతున్న విద్యార్థినులు

తుని, న్యూస్‌టుడే: చదువే కాకుండా బావిభారత పౌరులుగా హక్కులు, బాధ్యతలు కూడా గుర్తెరిగి సామాజిక బాధ్యతతో మెలగాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. మనకు కనిపించే దివ్యాంగులకు చేతనైన సహాయం చేయాలన్నారు. కళ్లు, కాళ్లు లేనివారు పడే బాధలు కళ్లకు కట్టేలా చూపిస్తూ విద్యార్థినులు స్ఫూర్తి రగిలించారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం నూకరత్నం, ఉపాధ్యాయినులు ఆరో తరగతిలోని ఆంగ్లపాఠం 'ది డిఫరెంట్ కైండాఫ్ స్కూలు' అంశాన్ని విద్యార్థినులతో చేయించి వారిలో సేవాభావం పెంపొందేలా చేయించారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: 'బాలికా సంరక్షణ' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు గురువారం ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో రాజబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ధర్మవరం ప్రతిభ విద్యాలయానికి చెందిన జె.నగ్మా, కె.వెంకట సత్య, ఎం.సాయిప్రవళిక, ఎం.భవానీ సత్యదుర్గ, ఎస్.శివప్రసాద్, బి.ప్రసన్నకుమార్‌లు విజేతలుగా నిలిచారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

కిర్లంపూడి, తుని పట్టణం: తిరుమల శ్రీవారి ఆలయంలో లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మల పల్లి రమేష్ చిల్లంగిలోని భూసమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం ఉపవాస దీక్ష చేశారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేయించారు. 108 కొబ్బరి కాయలను కొట్టి ఉపవాస దీక్ష ఆరభించారు. 108 మంది మహిళలు స్వామివారి అష్టోత్తరాన్ని రోజంతా పటించారు. భజనలు, హరినామ సంకీర్తణలు చేశారు. సాయంత్రం 4 గంటలకు నిమ్మరసం స్వీకరించి దీక్ష విరమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తీవ్రమైన తప్పిదాన్ని చేసిన వైకాపా నాయకులు తిరిగి ఎదురుదాడి చేయడం హిందూవులను మరింత కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఉలిసి ఐరాజు, యల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, మాదారపు వీరబాబు, కాకిలేటి బాబ్జి, బొండా రామణ, నందిబాబు తదితర నాయకులు, మహిళలు ఉపవాస దీక్షలో పాల్గొన్నారు.



చిల్లంగి ఆలయంలో చేపట్టిన దీక్షను ముగిస్తున్న తుమ్మలపల్లి రమేష్, కార్యకర్తలు

● తితిదేలో లడ్డూ అపవిత్రం కావడంపై ప్రాయశ్చిత దీక్ష కొనసాగిస్తున్నారు. కూటమి నాయకులు ఎస్.అన్నవరం ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి పట్టణంలోని పాత బజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం వరకూ పాదయాత్ర చేశారు. కూటమి నాయకులు మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి బాధ్యులపై చర్యలు తీసుకుని సనాతన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో బోనం చినబాబు, సుర్ల లోవరాజు, నారాయణాచార్యులు, అద్దేపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



తునిలో దీక్షలో పాల్గొన్న కూటమి నాయకులు

గండేపల్లి(జగ్గంపేట) : తిరుపతి లడ్డూ అపవిత్రతపై జగ్గంపేటలో మహిళలు సుందరాకాండ పారాయణ చేశారు. ఇక్కడి కొత్త కొండబాలు కాంప్లెక్స్‌లో గురువారం సుందరాకాండ పారాయణలో భాగంగా వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించిన అనంతరం 68 సర్గాలు పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

తుని పట్టణం: ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు (60) గురువారం మృతి చెందాడని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. తనది ఏలూరు అని, పేరు దొడ్డిపాక శ్రీను, తన తండ్రిపేరు సోమరాజుగా చెప్పాడన్నారు. అయితే బంధుమిత్రుల వివరాలు వృద్ధుడు చనిపోయాక కుటుంబీకులకు సమాచారం ఇవ్వలేకపోయామన్నారు. మార్చురీలో భద్రపరిచామని, వివరాలకు పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో వైఎస్సార్ కాలనీకి చెందిన ఎ.పైడికొండ(19) గురువారం జ్వరంతో మృతి చెందాడని అతని బంధువులు తెలిపారు. పది రోజులుగా అస్వస్థతతో ఉన్న అతను వైద్యం చేయించుకున్నా ఫలితం లేదన్నారు.

విద్యార్థిని అదృశ్యం..కేసు నమోదు

తుని: పట్టణంలోని ఇసకలపేట ప్రాంతానికి చెందిన విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ కె.సూరిబాబు తెలిపారు. ఈనెల 24న కళాశాలకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరిన ఆమె, తిరిగి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేధింపుల కేసులో నాలుగేళ్ల జైలు

రౌతులపూడి: భార్యను వేధించిన కేసులో భర్తకు నాలుగేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్‌కోర్టు (రాజమహేంద్రవరం) న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు. వివరాలివీ.. గిడిజాం గ్రామానికి చెందిన యువతిని బీబీపట్నం గ్రామానికి చెందిన జి.అక్కన్నపాత్రుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. అనంతరం ఆమెను వేధింపులకు గురిచేశాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి అన్నవరం అదనపు ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసి నిందితుడ్ని రిమాండుకు తరలించారు. వాదనల అనంతరం కోర్టులో శిక్ష ఖరారు చేశారు.

లారీ ఢీకొని తీవ్రగాయాలు

ఎలమంచిలి గ్రామీణం: ఎన్‌హెచ్‌పై లక్కవరం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలివీ.. తుని మండలం లోవకొత్తూరుకు చెందిన బి.కృష్ణ కుటుంబంతో కలిసి వాహనంలో ఎలమంచిలి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో టీ పాయింట్ వద్ద ఆపి మూత్ర విసర్జన కోసం రోడ్డు దాటుతుండగా అటువైపుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చెరువు కాదు.. రహదారి



జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రామవరం నుంచి కిర్లంపూడి మండలానికి వెళ్లే ర.భ.శాఖ రహదారి పెద్దపెద్ద గుంతలతో నిండిపోయింది. ఈ మార్గంలో వాహనదారులు ప్రయాణించేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు మధ్యంలో ఉన్న భారీ గుంత లోతు తెలియక అంచులవెంబడి ప్రయానిస్తున్నారు. వర్షం వచ్చిందంటే గోతుల్లో నీరుచేరి రోడ్డంతా చెరువులా మారుతుండడంతో ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తునారు.

జారుడు బల్ల కాదండోయ్.. రోడ్డే.



ప్రత్తిపాడు మండలం టి.రాయవరం వెళ్లే రోడ్డు ఇది. వర్షం పడితే జారుడుబల్లలా మారుతుంది. మండల కేంద్రం నుంచి 5 కి.మీ దూరంలో ఉండే ఈ గ్రామానికి తారు రోడ్డు కలగానే మిగిలింది. టి.రాయవరం- ప్రత్తిపాడు లంపకలోవ రోడ్డు 3 కి.మీ. పొడవునా ఇలాగే ఉంటుంది. టి.రాయవరం మూడేళ్ల కిందట పంచాయతీగా మారినా తారురోడ్డు మాత్రం కలగానే ఉంది. వెయ్యిమంది జనాభా ఏ చిన్న అవసరానికైనా ప్రత్తిపాడు రావాలి. ఆటోలు తప్ప మరో రవాణా సౌకర్యమూ లేదు. వానొస్తే ఆటోలు రావు. పంచాయతీరాజ్ పరిధిలోని ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని సర్పంచి తటవర్తి సుబ్బారావు కోరారు.